# దొమ్మీ
## వేమూరి వేంకటేశ్వరరావు

'సైరను' ఊదుకుంటూ వచ్చి, కీచుమని శబ్దం చేస్తూ 'అంబులెన్సు' ఆసుపత్రి ప్రాంగణంలో ఆగింది. అంబులెన్సులో ఉన్న 'పేరామెడిక్'లు ఎదురు సన్నాహం వచ్చిన నర్సుల సహాయంతో క్షతగాత్రి పడుక్కుని ఉన్న 'స్ట్రెచర్'ని బయటకు దింపి, "ట్రామా, ట్రామా" అంటూ 'ఎమర్జెన్సీ' గదిలోకి వచ్చేరు.

ఇంగ్లీషు భాషలోని 'ట్రామా' అనే మాటకి 'బలమైన గాయాలు' అని తెలుగులో అర్థం చెప్పుకోవచ్చు. రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు, కత్తి పోట్లు, తుపాకి దెబ్బలు, దొమ్మీలు మొదలయిన సందర్భాలలో బలంగా తగిలిన దెబ్బలు ఒక రకమైన భౌతిక ట్రామా. మనస్సుకి గట్టిగా దెబ్బ తగిలితే అది మానసిక ట్రామా.

అమెరికాలో ఉన్న చాల ఆసుపత్రులలో 'ఎమర్జెన్సీ వార్డు' అనే భాగం ఉంటుంది. కొన్ని ఆసుపత్రులలో క్షతగాత్రుల సంరక్షణకి ఎమర్జెన్సీ వార్డు లోనే ట్రామా విభాగం అని ఉంటుంది. ప్రమాదంలో తగిలిన దెబ్బలకి శస్త్ర చికిత్స అవసరం అయితే ఈ ట్రామా విభాగం లోకి తీసుకెళతారు. లేకపోతే 'మెడికల్' విభాగం లోకి తీసుకెళతారు. టూకీగా చెప్పాలంటే 'ట్రమా' అనగానే శస్త్రంతో పని, 'మెడికల్' అనగానే మందులతో పని.

క్షతగాత్రిని లోపలికి తీసుకు రావడమేమిటి, ఎమర్జెన్సీ వార్డులో ఉన్న డాక్టర్లు, నర్సులు వెంటనే మనిషిని స్ట్రెచర్ మీద నుండి బల్ల మీదకి మార్చి చుట్టూ గుమి గూడడమేమిటి, అన్నీ నిమిషాల మీద జరిగి పోయాయి.

"ఏమిటి జరిగింది?" నేనడిగేను.

"సూపర్ బజారు దగ్గర చిన్న దొమ్మీ జరిగిందిటండి. అందులో ఈ పెద్దావిడ కాలు నిలదొక్కుకో లేక కింద పడిందిటండి. పడ్డ మనిషి మరి లేవ లేదండి. కూతురు పక్కనే ఉందిటండి. జన సందోహం ఇలా పెద్ద కెరటంలా కొట్టుకొచ్చి ఈమెని ఒక తోపు తోసేరుటండి. మనిషంటే కింద పడిపోయింది కాని చూడడానికి పైకి ఏమీ దెబ్బలు కనిపించడం లేదండి. కాని మనిషికి స్పృహ తప్పి అరగంట కావస్తోందండి. ఉలుకు లేదు, పలుకు లేదు, అలా మానులా పడుందండి....."

"...ఇది స్ట్రోకు. దీనికి 'సర్జరి' అనవసరం. 'మెడికల్ వార్డు' లోకి తీసికెళ్లండి"

పక్కింటి పిన్ని గారి కంటె ఒక్క వాసి ఎక్కువ వెడల్పుగా ఉన్న నల్ల నర్సు విల్మా తీర్మానించింది. మనిషి ఆకారం, వాలకం చూడగానే పెత్తనం చెలాయించ గలిగే పెద్ద నర్సు అని ఎవరేనా అనుకుంటారు. కాని ఈ విమలమ్మ పెద్ద నర్సు కింద పని చేసే చిన్న నర్సు. అసలు పేరు విల్మా కాని, నేను మాత్రం విమలమ్మ అని తెలుగు పేరు పెట్టి పిలిచే వాడిని. ఏం? మన దేశంలో పేర్లన్నీ ఈ ఇంగ్లీషు వాళ్లు వాళ్లిష్టం వచ్చినట్లు మార్చెయ్యవచ్చు కానీ మనమేనేమిటి తక్కువ తిన్నాం?

"ఆ! మరీ చెప్పొచ్చావ్. సరిగ్గా దొమ్మీ జరిగే వేళకే ఈవిడకి వాతం కమ్మిందంటావా?"

అని అంబులెన్సుని తోలుకొచ్చిన ఆసామీ విమలమ్మతో లడాయి వేసుకున్నాడు. అమెరికాలో అంబులెన్సు డ్రైవర్లకి కూడ ప్రథమ చికిత్సలో తరిఫీదు ఉంటుంది. అందుకని తనకు తెలుసున్న విషయం తను చెప్పేడు.

స్ట్రోకు ప్రమాదకరమైన పరిస్థితి. దీని పర్యవసానంగా పక్షవాతం రావచ్చు. వెంటనే చికిత్స చెయ్యకపోతే కాలో, చెయ్యో కదలకుండా పడిపోవచ్చు. మాట పడిపోవచ్చు. లేక, శరీరం అంతా తోటకూర కాడలా వేలాడి పోవచ్చు. లేదా ప్రాణం పోవచ్చు. కనుక ఇక్కడ నర్సులూ, డ్రైవర్లూ తగువులాడుకుంటూ ఉంటే ఎటూ తేల్చకుండా ఊరుకుందుకి ఇది ఐక్యరాజ్య సమితి ఏమీ కాదు. అందుకని నేనే జోక్యం కలుగ జేసుకుని అన్నాను.

''చాల్చాలు. ఇక్కడ హయాంలో ఉన్న వైద్యుణ్ణి నేను. ఇది మెడికల్ కేసో, సర్జికల్ కేసో నేను తేలుస్తాను. ఈ వేళ ట్రామా భాగంలో కేసులు ఎక్కువ లేవు. కనుక ట్రామా గదిలోకే తీసుకుని వెళ్లండి.''
అని ఉత్తర్వు జారీ చేసి నరసమ్మ విమలమ్మ వైపు తిరిగి సముదాయింపుగా అన్నాను,
''ప్రస్తుతానికి ట్రామా అనుకున్నంత మాత్రన వచ్చిన నష్టం ఏమీ లేదుగా. పేషెంటు రికార్డుని రాయడం పూర్తి చెయ్యండి ముందు. జీవలక్షణాలు, టెంపరేచరు, బీపీ, నాడి, శ్వాస కొలచి నమోదు చెయ్యడం, లేబులో పరీక్షకిగాను రక్తం మచ్చు తీయడం, వగైరా తంతు కానివ్వండి. మధ్యంతరంగా పరీక్ష ఆపేసిన ఆ చంటాడి చెవి పోటుకి కారణం ఏమిటో తేల్చుకుని నేను ఇప్పుడే వస్తాను.''
అని సగం సగం చూస్తూ మధ్యలో ఆపేసిన కేసుని చూడ్డానికి మళ్లా వెనక్కి వెళ్లేను. తిరపతిలో మంగలాడు క్షవరం చేసే తీరు ఎప్పుడూ చూడ లేదు కాని, మా ఎమర్జెన్సీ వార్డులో చేతులు తక్కువ అయినప్పుడు మేము కేసు నుండి కేసుకి గెంతుతూ ఉంటే ఆ సామెతే గుర్తుకి వస్తుంది.

వెనక్కి వెళ్లి తిరిగొచ్చేసరికి నర్సులు పేషెంటుని చకచకా తయారు చేస్తున్నారు. పేషెంటు చైనా దేశపు మనిషి. కూతురే తల్లి తరఫున అడిగిన ప్రశ్నలకి సమాధానాలు చెబుతోంది. తల్లి పేరు చెంగు. మధ్య మధ్యలో తల్లి చెవిలో ఏదో చైనా భాషలో చెబుతోంది. కాని తల్లి ముఖ కళవళికలలో లేశమంత మార్పు లేదు. నిశ్చలంగా, నిశ్చింతగా నిద్రపోతూన్నట్లున్న ఆ మనిషి బతికుందో లేదో కూడ ఆ అడ కూతురుకి తెలీదు.

పేషెంటుని ఎగా దిగా మరొక సారి చూసిన తర్వాత విమలమ్మ చెప్పిన స్ట్రోకు సిద్ధాంతమే నిజమేమోనని అని పించింది. ఈ నర్సులని అంత తేలికగా తీసి పారెయ్యడానికి వీలు లేదు. వైద్యులకి పుస్తకం గురువైతే ఈ నర్సులకి అనుభవం గురువు. పైకి ఏమీ అనక పోయినా స్ట్రోకు అంటే ఏమిటో ఒకసారి మననం చేసుకున్నాను.

మెదడులోకి రక్తం తీసుకెళ్లే నాళాలు ప్రమాద వశాత్తూ పగిలినా, లేదా నాళంలో ప్రమాద వశాత్తూ ఏదయినా అడ్డం పడ్డా, మెదడుకు కావలసిన మోతాదులో రక్తం అందదు. ఈ సందర్భంలో మెదడుకి కలిగే అపాయమే స్ట్రోకు అంటే. ఈ స్ట్రోకులలో రకరకాలు ఉన్నాయి. పిత్తఘృతాల్ (దీననే ఇంగ్లీషులో కొలెస్టరాల్ అంటారు) వంటి పదార్థాలు రక్త నాళాల గోడల లోపల చేరినప్పుడు నాళం సన్నబడి రక్త ప్రవాహం ఆగిపోతే దానిని 'థ్రాంబోసిస్' అంటారు. నాళం పగిలి రక్తం మెదడులోకి చిమ్ముకు పోతే దానిని 'సెరిబ్రల్ హెమరేజి' అని కాని ఉత్తినే హెమరేజి అని కాని అంటారు. రెండూ ప్రమాద కరమైన పరిస్తితులే కాని గుడ్డిలో మెల్లలా రెండింటిలోనూ థ్రాంబోసిస్ మెరుగు. ఎందువల్లనంటే థ్రాంబోసిస్ వల్ల స్పృహ తప్పి పోవడం అంటూ సామాన్యంగా జరగదు. ఈ రెండింటికి మధ్యనున్న తేడా తెలియాలంటే కొంచెం శరీర నిర్మాణ శాస్త్రం తెలియాలి.

బల్ల మీద ఉన్న మన చెంగమ్మ గారు చాల లోతైన నిద్రలో ఉన్నారు. ఇలాంటి నిద్రని ఇంగ్లీషులో 'కోమా' అంటారు. గ్రీకు భాషలో 'కోమా' అంటే ఘాటైన నిద్ర అని అర్థం. తెలుగులో 'దీర్ఘనిద్ర' అంటే 'చావు' అని అర్థం ఉంది కనుక కోమాని 'ఘాటునిద్ర' అని అంటే బాగుంటుంది. ఈ రకం ఘాటునిద్రలో ఉన్న వారి పక్కన బాంబు

వేసినా మెలుకువ రాదు. సూదితో గుచ్చినా మెలుకువ రాదు. జ్ఞానేంద్రియాలకి మూతలు పడిపోయాయన్న మాట.

అసలు కపాలంలో బంధించబడి ఉన్న మెదడుకి  జ్ఞానేంద్రియాలు కిటికీల లాంటివి. చుట్టూ జరుగుతూన్న విషయాలని జ్ఞానేంద్రియాలు సేకరించి, వాటిని విద్యుత్ వాకేతాలుగా మార్చి పెద్ద మెదడుకి పంపుతాయి. ఈ పెద్ద మెదడునే ఇంగ్లీషులో 'సెరిబ్రమ్' అంటారు. ఈ పెద్ద మెదడే మన స్మృతి స్థావరం. ఈ పెద్ద మెదడే శరీరం ఎప్పుడెప్పుడు ఏమేమి చెయ్యాలో ఆదేశిస్తుంది. ఈ ఆదేశాలని చిన్న మెదడు ఆచరణలో పెడుతుంది. చిన్న మెదడుని 'సెరిబెల్లమ్' అంటారు. ఈ చిన్న మెదడుని ఆనుకుని మేధాకాండం తోకలా కిందికి దిగి వెన్ను పాముగా మారుతుంది. ఈ వెన్నుపాము నుండే నరాలు శరీరం అంతా వ్యాపించి మెదడు దగ్గర బయలు దేరిన వాకేతాలని కండరాల వరకు మోసుకుని వెళతాయి.

చిన్న మెదడు, మేధాకాండం కలుసుకున్న చోట ముచ్చిక లాంటి కట్టడం ఒకటి ఉంది. చేపలు, పురుగులు మొదలైన అల్ప జీవులలో ఈ ముచ్చిక మాత్రం ఉంటుంది;  మెదడంటూ ఏమీ ఉండదు, అర్ధభాగాలూ ఉండవు. ఈ ముచ్చికని ఇంగ్లీషులో 'బ్రెయిన్ స్టెమ్' అంటారు.  మనం 'మేధాకాండం' అందాం. ఈ మేధాకాండం వెళ్లి అర్ధభాగాలని అతుక్కునే దమ్మిడీ అంత మేరని ఇగ్లీషులో 'రెటిక్యులార్ ఏక్టివేటింగ్ సిస్టమ్' అనీ, లేదా టూకీగా పొడి అక్షరాలతో 'ఆర్. ఏ. యస్.' అంటారు. ఇది మెదడులో ఒక మీటలా పని చేస్తుంది. మెదడుకి 'మెయిన్ స్విచ్' లాంటిది. ఇది దెబ్బ తింటే దీపం ఆరిపోయినట్లే. అప్పుడు స్పృహ పూర్తిగా పోతుంది. ఈ మీట సరిగ్గా మన కండ్ల వెనకాతల ఉంది. కనుక మెదడులో జరిగిన రక్త స్రావం వల్ల ఈ మీట దెబ్బ తింటే ఆ విషయం కండ్లు పరీక్ష చేసి కనుక్కో వచ్చు.

ఈ సందర్భంలో నా చిన్నతనంలో మా ఊళ్లో జరిగిన ఒక సంఘటన ఇప్పటికీ నాకు కళ్లకి కట్టినట్లు జ్ఞాపకం వస్తోంది. మా పెరటి వీధిలో ఉన్న చొక్కాకుల తాతకి సుస్తీ చేసింది. అందరూ పెదవి విరిచేసేరు. మనిషిని మంచం మీంచి దించేసేరు.  అంతా లబో, దిబో మన్నారు. శ్మశానానికి తీసికెళ్లడానికి పాడి కట్టే ప్రయత్నంలో ఉన్నారు. ఈ లోగా మా ఊళ్లో కొత్తగా బల్ల వేలాడగట్టి 'ప్రేక్టీసు' పెట్టిన చల్లా సుబ్బారాయుడు గారు అటు వెళ్లడం ఎవరో చూసి, ఎందుకేనా మంచిదని జటకాని ఆపుచేసి, ఆయనని తాత దగ్గరకి తీసుకొచ్చారు. డాక్టరు గారు తాత కనురెప్పలని ఒక చేత్తో వెనక్కి లాగి, రెండో చేత్తో కంట్లోకి 'టార్చి లైటు' వేసి పరీక్ష చేసి, తల పంకించి, తాతకి ఏదో 'ఇంజక్షన్' ఇచ్చి, పక్కన పది నిమిషాలు కూర్చున్నారు. నిద్దట్లోంచి లేచినట్లు చొక్కాకుల తాత లేచి కబుర్లు చెప్పడం మొదలు పెట్టేడు. ఆ తరువాత సుబ్బారాయుడి గారి హస్తవాసికి తునిలో తిరుగు లేదు.

(మనలో మనమాట. దరిదాపు ఇటువంటి సంఘటనే 20 అక్టోబరు 1988లో విజయ దశమి నాడు పుట్టపర్తిలో సత్యసాయి బాబా ఎదుట జరిగిందిట. బొంబాయి ఐ. ఐ. టీ. మాజీ డైరక్టరు, బ్రిగేడియర్ ఎస్. కే. బోసు వి. ఐ. పీ. ల కొరకు ప్రత్యేకించిన కుర్చీలలో కూర్చుని పూర్ణాహుతిని తిలకిస్తూ తటాలున ఆ కుర్చీలోనే నేలకి ఒరిగి పోయి, "ప్రాణాలు వదిలి పెట్టేరుట". అదే సమయంలో లోపల హాలులో జనసందోహానికి విజయ దశమి సందేశం ఇస్తూన్న బాబా మధ్యలో ఆగి, పరుగున బయటకు వచ్చి బోసు చెయ్యి పట్టుకుని లేవమన్నారుట. "చచ్చిన

బొందిలో ప్రాణం పోసేరు'' అని బోసు స్వహస్తాలతో సంతకం పెట్టిన ఉత్తరం ప్రతిని ఐ. ఐ. టి. ఫిజిక్సు ప్రొఫెసర్ శ్రీ జి. గురునాథం గారు నాకు పంపగా తెలిసింది.)

హస్తవాసి వల్లో, బాబా కృపా కటాక్షాల వల్లో, ఎలాగో ఒక లాగ చెంగమ్మ బతికి బయట పడితే చాలనుకుంటూ, చెంగమ్మ కండ్లు రెండూ పరీక్ష చేసి ప్రతివర్తితలు ఎలా ఉన్నాయో గమనించేను. ఏమీ కదలిక కనిపించ లేదు. రెటిక్యులార్ ఏక్టివేటింగ్ సిస్టమ్ దెబ్బ తిని ఉండక పోతే చెంగమ్మ పరిస్థితి ఇంత అన్యాయంగా ఉండదని మనస్సులో ఒక అనుమానం పీడిస్తోంది. మరొక్క పరీక్ష చెయ్యాలి. అందుకని కుడి చేతి బొటన వేలు తోటీ, చూపుడు వేలు తోటీ చెంగమ్మ కనురెప్పలు విడదీసి, ఎడం చేత్తో ఆవిడ బుర్రని ఎటూ, అటూ తిప్పి చూసేను. ఈ పరీక్షని 'బొమ్మ కండ్ల ప్రతివర్తిత పరీక్ష' అంటారు. బుర్రని కదిపినప్పుడల్లా మన అంతర్ కర్ణాలలో ఉన్న సంతులన యంత్రాంగం ఆ కదలికని గ్రహించి, బుర్ర కదులుతున్నాది సుమా అన్న వాకేతాన్ని మెదడుకి పంపుతుంది. వెంటనే ఆ కదలికకి విరుగుడుగా మెదడు కంటి గుడ్లని రెండో పక్కకి తిప్పుతుంది. చిన్న పిల్లలు ఆడుకునే రబ్బరు బొమ్మల కండ్లు ఇలాగే తిరుగుతాయి. ఇది ఇలా జరగక పోతే మనం బుర్ర ఆడించినప్పుడల్లా తల తిరిగినట్లు అవుతుంది. ఈ కార్యక్రమానికి
సంబంధించిన వాకేతాలు మన కూడలి కేంద్రం అయిన రెటిక్యులార్ ఏక్టివేటింగ్ సిస్టమ్ గుండా వెళ్లాలి. ఈ కేంద్రం దెబ్బ తింటే బొమ్మ కండ్ల ప్రతివర్తితలు ఉండవు. నేను అనుకున్నంత పనీ జరిగింది. చెంగమ్మ కండ్లలో ఏ రకమైన కదలికా లేదు.

నా ముఖం కత్తి వేటుకి నెత్తురు చుక్క లేనట్లు పాలిపోయింది. నా ముఖ కళవళికలను చదువుతూన్న చెంగమ్మ కూతురు ఆత్రుతతో అడుగుతోంది.

''డాక్టర్! మా అమ్మకి మరేమీ పరవా లేదు కదా?''

ఇటువంటి పరిస్థితులలో వైద్యుడు రోగి బంధువులకి ఏమి చెప్పవచ్చు అన్న సమస్యని భారతదేశంలో ఒకలాగ అమెరికాలో మరొకలాగ ఎదుర్కొంటారు.

''మీ అమ్మ పరిస్థితి బాగా ....''

వాక్యాన్ని అర్థాంతరంగా ఆపేసి, నర్సుని ఎలుగెత్తి కేకేసేను.

''ఈవిడకి అర్జంటుగా 'సిటీ స్కేను' తియించాలి. మేడ మీదకి పంపే ఏర్పాట్లు చేయించు.'' అంటూ ఒక హుకుం జారీ చేసి, సిటీ స్కేను అంటే ఏమిటో చెంగమ్మ కూతురుకి చెప్పే మిషతో మాట మార్చి,

''చూడమ్మా! సిటీ స్కేను అంటే మరేమీ కాదు. అదొక రకం 'ఎక్సురే' అనుకో. ఎక్సురే అంటే సాధారణంగా ఒకటో, రెండో ఫొటోలు తీస్తారు. సిటీ స్కేను అంటే ఎక్సురే సినిమావే అనుకో. అంటే మీ అమ్మ మెదడుకి ఎక్సురే కిరణాలతో బోలెడు ఫొటోలు తీస్తారు. కంప్యూటరు సహాయంతో ఈ ఫొటోలని చదువుతారు. అందుకనే ఈ పద్ధతిని 'కంప్యూటెడ్ టోమోగ్రఫీ' అని గాని లేదా ముద్దుగా 'సీ. టీ' అని గాని, టూకీగా 'సిటీ స్కేను' అంటారు. ఇందులోనే మరొక రకం పద్ధతిని 'కంప్యూటెడ్ ఏక్సియల్ టోమోగ్రఫీ' లేదా సీ. ఏ. టి. అనీ, లేదా టూకీగా 'కేట్ స్కేన్' అంటారు. ఈ పద్ధతిలో ......''

అని చెప్పేది పూర్తయే లోగా ఎమర్జెన్సీ వార్డు లోకి కొత్తగా వచ్చిన కేసుని చూడమని పిలుపు వచ్చింది. పెల్లుబికి వస్తూన్న దుఃఖాన్ని ఆపుకుంటూ ఉన్న చెంగమ్మ కూతురినే ఓదార్చేదా, కొత్తగా వచ్చిన పేషెంటునే చూసేదా?

కొత్తగా వచ్చిన పేషెంటుకి డెబ్భయి ఏండ్లు ఉంటాయేమో. స్నానాల గదిలో కాలు జారిందిట. నుదిటి మీద గాయం గట్టిగానే తగిలినట్లుంది. ముఖం అంతా రక్తసిక్తమై ఉంది. తుంటి ఎముక విరిగిందంటే ప్రాణాపాయం కూడా. పెద్దాయన పరిస్థితి అదుపులోకి వచ్చే సరికి అరగంట పైగా పట్టింది.

మిగిలిన పనిని 'ఇంటర్న్'కి (అమెరికాలో ఇంటర్న్ అంటే మన దేశంలో 'హవుస్ సర్జన్'తో సమానం) అప్పగించి, సీటీ స్కేను తతంగం ఎంత వరకు వచ్చిందో కనుక్కుందామని మేడ మీద ప్రయోగశాలలో పనిచేసే మా సాంకేతిక నిపుణుడు రాబర్ట్ కి ఫోను చేసేను.

''ఇంకా పని పూర్తి కాలేదు. కాని చూసిన బొమ్మలని బట్టి 'బ్రెయిన్ స్టెమ్' దగ్గర రక్తం చిమ్మినట్లు కనిపిస్తున్నాది. 'సారీ!' డాక్టర్! ఈ రోజు చెడ్డ వార్త చెప్పవలసి వచ్చింది.''

తల్లి చచ్చిపోతున్నాదని కూతురుకి చెప్పడం ఎలా? ఆ అమ్మాయికా, ఇంగ్లీషు సరిగ్గా అర్థం అవడం లేదు. ఎందుకేనా మంచిది, ఆ సీటీ స్కేను బొమ్మలేవో నేనే స్వయంగా చూద్దామని ఎలివేటరు దగ్గరకి వెళ్లి, గోడ మీద మీటని నొక్కి నిరీక్షిస్తున్నాను. ఎలివేటరు వచ్చింది. నేనూ లోపలికి వెళ్లబోతూ ఉంటే మా విమలమ్మ బయటకు వస్తూ తారస పడింది.

''డాక్టర్ రావ్! మిసెస్ చెంగ్‌కి సీటీ స్కేను అయిపోయింది. వరండాలోనే వేచి ఉంది. డాక్టర్ రావ్! విశేషం ఏమిటో తెలుసా? మిసెస్ చెంగ్‌కి పూర్తిగా మెలుకువ వచ్చేసింది. తల్లి, కూతురు చిలకల్లా మాట్లాడుకుంటున్నారు.''

''అసంభవం! చెంగమ్మకి బొమ్మ కండ్లు లేవు. రాబర్ట్‌కి సీటీ స్కేన్ ఫొటోలలో రక్తం కనిపించింది. ఈ పేషెంటుకి మెలుకువ రావడమా? అసంభవం!''

''డాక్టర్ రావ్! మీ వైద్య సిద్ధాంతాన్ని నమ్మమంటారా? నా కండ్లని నమ్మమంటారా? మీరే చూడండి'' అంటూ చెంగమ్మ పడుక్కున్న పరుపు వేపు చూపించింది.

నా కండ్లని నేనే నమ్మలేక పోయాను. బొమ్మ కండ్ల ప్రతివర్తితలు ఎందుకు కనిపించ లేదు? బ్రెయిన్ స్టెమ్‌లో రాబర్ట్‌కి రక్తపు డాగులు ఎందుకు కనిపించేయి? ఎవరు ఎక్కడ పప్పులో కాలేసేరా అని పరిపరి విధాల పరిగెడుతూన్న నా మనస్సులోని ఆలోచనా తరంగాలకి అంతరాయం కలిగిస్తూ, ''హార్ట్ ఎటాక్!'' అంటూ ఒక మధ్య వయస్కుడిని లోపలికి తోసుకుంటూ వచ్చేరు నర్సులు. ''కదలండి! కదలండి!'' అంటూ పెద్ద నర్సు అందరినీ అదమాయిస్తోంది.

యాంత్రికంగా అంతా హృద్రోగపు ఆసామీ చుట్టూ మూగేం. మనిషికి నలభై ఉంటాయి. శీతల స్వేదంతో ముఖం అంతా చెమ్మగా ఉంది. గబగబా 'ఇ. కె. జీ.' తీసి చూసేం. అది కచ్చితంగా హార్ట్ ఎటాకే. సందేహం లేదు.

'హార్ట్ ఎటాక్!' రావడానికి 'స్ట్రోకు' రావడానికి ఉండే కారణాలలో కొన్ని పోలికలు లేకపోలేదు. గుండెకాయకి రక్తం మోసుకెళ్లే నాళంలో కదుం కట్టిన రక్తపు గడ్డ అడ్డు పడితే హార్ట్ ఎటాక్! వస్తుంది. కనుక 'హార్ట్ ఎటాక్!' అంటే గుండెకు రక్తపు సరఫరా ఆగిపోవడం. మెదడుకి వెళ్లే రక్త నాళంలో అడ్డంకి వచ్చి మెదడుకి రక్తపు

సరఫరా ఆగిపోతే 'బ్రెయిన్ ఎటాక్' అనాలి; కాని 'స్ట్రోకు' అంటారు.  హార్ట్ ఎటాక్‌ని తెలుగులో గుండె పోటు అని కాని హృద్ ఘాతం అని కాని అనొచ్చు. అదే లెక్కని 'స్ట్రోకు'ని మెదడు పోటు అని కాని మస్తిఘాతం అని కాని అనాలి.

కనుక మస్తిఘాతం వచ్చిన వారికి ముందుగా చెయ్యవలసిన ప్రథమ చికిత్స ఏమిటంటే కరడు కట్టిన రక్తపు కదుం కరిగేలా చూడడం. దీనికి ప్రత్యేకమయిన మందులు ఉన్నాయి. ఆ మందులని 'ఐ. వీ.' ద్వారా రక్త నాళాలలోకి ఎక్కించడానికి ప్రయత్నం చేయిస్తూ ఉండగా డాక్టర్ రంగనాథన్ డ్యూటీ లోకి రావడం గమనించి, ఈ గుండె పోటు రోగిని అతనికి అప్పగించి, నేను మళ్లా మన చెంగమ్మ సీటీ స్కేను బొమ్మలు స్వయంగా చూద్దామని 'రేడియాలజీ' విభాగానికి పరిగెత్తుకుంటూ వెళ్లేను.

ఎక్సరే బొమ్మలని, సీ. టీ. స్కేను బొమ్మలని పరీక్షించే నిపుణుడిని 'రేడియాలజిస్టు' అంటారు. చెంగమ్మ సీటీ స్కేను బొమ్మలని రేడియాలజిస్టుకి ఇచ్చి అతని అభిప్రాయం అడిగేను.

ఇలాంటి బొమ్మలని చూడడానికి ఒక గాజు పలక, దాని వెనకాతల దీపం ఉన్న ఏర్పాటు ఒకటి ఉంటుంది. దానిలో సీటీ స్కేను బొమ్మలని అమర్చి చూసీ చూడగానే,

''ఇది 'సెరిబెల్లార్ హెమరేజి'. అనుమానం లేదు. రక్తస్రావం రెండు మూడు సెంటీ మీటర్ల మేర వ్యాపించి పోయింది......''

''...ఇది సెరిబెల్లారా? డామిట్! కొంప మునిగిందయ్యా''

అని ఒక్క సారి కేక వేసి నట్లు అరచి, ఒక్క ఉదుటున పెద్ద పెద్ద అంగలు వేస్తూ పరుగు లంకించుకున్నాను.

హెమరేజి అంటే రక్తస్రావం అని చెప్పేను కదా. ఈ రక్తం ఎక్కడ స్రవించిందో చెప్పడానికి 'హెమరేజి' అన్న మాటకి ముందు ఒక విశేషణం వాడతారు. సెరిబెల్లార్ హెమరేజి అంటే చిన్న మెదడులో రక్తస్రావం. స్రవించిన రక్తం గడ్డ కట్టి కదుంలా తయారయినా, వాపు కలుగజేసినా దానిని 'హెమటోమా' అంటారు.
మెదడుకీ, మెదడు చుట్టూ ఉండే 'డూరా' అని పిలువబడే పొరకి మధ్య రక్తం స్రవించి గడ్డ కడితే అది 'సబ్ డూరల్ హెమటోమా'. మెదడు లోపల ఎక్కడో వాచితే అది 'ఇంట్రా సెరిబ్రల్ హెమటోమా'. అలాగుంటాయి ఈ పేర్లన్నీ.

రక్త స్రావం కాని, కదుం కట్టడం కాని ఎల్లప్పుడూ ప్రాణాంతకం అయిన ప్రమాదం కాదు. మేధాకాండం లోపల రక్తస్రావం జరిగితే అది యమధర్మ రాజు పాశం. చిన్న మెదడులో స్రావం జరిగితే అది సత్యవంతుడి తరఫున సావిత్రి అడ్డు వేసిన హస్తం. మిగతా మస్తిఘాతాలు అంత సులభంగా లొంగవు కానీ, చిన్న మెదడులో రక్తస్రావం జరగడం వల్ల వచ్చిన మస్తిఘాతాన్ని మాత్రం  శస్త్ర చికిత్స చేసి కుదర్చ వచ్చు. కాని ఆ కాగల కార్యాన్ని తొందరగా తెమల్చాలి. నిమిషాల మీద శస్త్రవైద్యం చేసి చిన్న మెదడులోకి స్రవించి కరడు కడుతూన్న రక్తపు ముద్దని అతి త్వరగా తీసెయ్యక పోతే ఆ కరడు కదుం కట్టి మేధాకాండం మీద ఒత్తిడి పెట్టడం మొదలు పెడుతుంది. దానితో ఊపిరి ఆగి పోతుంది. అదీ నా గాభరాకి కారణం. అదే నా పరుగుకి కారణం. ఇప్పటికే కాలహరణం అయిపోయింది.

నా కాలి కంటె బుర్ర ఇంకా జోరుగా పని చేస్తున్నాది. ఇప్పటికి పరిస్థితి నిజ స్వరూపం అరటి పండు ఒలచి పెట్టినట్లు అర్థం అయింది. చెంగమ్మ చిన్న మెదడులో రక్త స్రావం జరిగింది. దాని వల్ల ఆ దగ్గరలోనే ఉన్న

మేధాకాండం, ఆ కాండం మీద ఉన్న రెటిక్యులార్ ఏక్టివేటింగ్ సిస్టమ్ దెబ్బ తినలేదు కాని కొద్దిగా బెదిరేయి. దాని వల్ల పేషెంటు తాత్కాలికంగా కోమా లోకి వెళ్లి పోయింది. కొద్ది క్షణాలు బొమ్మ కండ్ల ప్రతివర్తితలు ఆగిపోయాయి. ప్రయోగ శాలలో రాబర్ట్ చూసినది మేధాకాండం మీదకి చిమ్మబడ్డ రక్తపు డాగులు మాత్రమే; మేధాకాండం లోపలి నుండి బయటకు స్రవించిన రక్తం కాదు. ఈ విషయం అర్థం కాక దరిదాపు గంట సేపు కాలం యాపన చేసేను. ఆలస్యం అమృతం విషం అన్న నానుడి ఈ సందర్భంలో అక్షరాలా వర్తిస్తుంది.

యంత్రంలా పనిచేస్తూన్న నా మెదడులో ఒక్క సారి ఒక ఆలోచన మెరిసింది. మా ఆసుపత్రిలో మెదడు మీద ఆపరేషను చెయ్యడానికి కావలసిన సదుపాయాలు లేవు. కనుక పేషంటునీ, పేషెంటు రికార్డునీ అతి త్వరగా పెద్దాసుపత్రికి బదిలీ చెయ్యాలి. అందుకని రాబర్ట్ పని చేస్తూన్న 'లేబు' పక్కకి చేరుకునే వేళకి నా కాలికి మరకట్టు వేసి,

"రాబర్ట్! ఆ చెంగమ్మ జబ్బేమిటో అర్థ అయింది. అది సెరిబెల్లార్ హెమరేజి. అర్జంటుగా ఆపరేషను చేస్తే కుదిరే రోగం. కనుక ఆ సీటీ స్కేను బొమ్మలని పెద్దాసుపత్రికి ఫేక్సు చెయ్యి" అని నేను అరవడం, "అలాగే" అని రాబర్ట్ సమాధానం చెప్పడం మాత్రం నాకు గుర్తుందంతే! మరుసటి క్షణంలో చెంగమ్మ పక్క పక్కకి చేరేను. చెంగమ్మ పరిస్థితి ఏమీ బాగు లేదు. పది నిమిషాలు కూతురితో మాట్లాడిందో లేదో మళ్లా మగత కమ్మేసిందిట. ఇలా మెలుకువ వస్తున్నాది. అలా మగత కమ్మేస్తున్నాది. నేను వెంటనే పెద్దాసుపత్రిలో 'నూరో సర్జన్'కి ఫోను చేసేను. కథనం అంతా చెప్పేను.

"సీటీ స్కేనులు పంపుతున్నారుగా. అవి రానివ్వండి, చూద్దాం" అన్నాడాయన.

ఈ లోగా చెంగమ్మ కూతురికి విషయం అంతా బోధ పరచడానికి వెళ్లేను. కాని నేను చెప్పిన మాటకి ఇప్పుడు ఏమి విలువ ఉంటుంది? ముందు ప్రాణాపాయం అన్నాను. నా మాట నా నోట్లో ఉండగానే చెంగమ్మ చిలకలా కూతురితో కబుర్లు చెప్పింది. ఇప్పుడు సర్జరికి మరొక ఆసుపత్రికి బదిలీ చెయ్యాలంటే గొల్లపిల్లవాడు, తోడేలు కథలా అవదూ? ఎలాగో ధైర్యం తెచ్చుకుని చెంగమ్మ కూతురుకి అంతా పూస గుచ్చినట్లు చెప్పి, కొంచెం ఓపిక పడితే అన్నీ సర్దుకుంటాయని ధైర్యం చెప్పి, సీటీ స్కేనులు ఫేక్సయాయో లేదోనని రాబర్ట్ ఆఫీసు వేపు వెళ్లి,

"రాబర్ట్! అ కాగితాలని ఫేక్సు చెయ్యడం అయిపోయిందనుకుంటాను" అని మాట వరసకి అన్నాను.

"ఇంకా లేదండి. ఈ వేళ ఫేక్సు మెషీను చాల బిజీగా ఉందండి."

"ఆ బొమ్మలు తక్షణం వెళ్లాలోయ్!"

"ఉత్తర క్షణంలో వెళ్లాలంటారా?"

"హారి నీ సిగ తరగా" అని నాలో నేనే అనుకుని, "ఉత్తరం లేదు, దక్షిణా లేదు. పంపవయ్యా మగడా! ఇప్పటికే ఆలస్యం అయిపోయింది" అని విసుక్కున్నాను.

మరో పది నిమిషాలు పోయిన తర్వాత పెద్దాసుపత్రిలో నూరో సర్జన్‌కి మరొక సారి ఫోను చేసేను, సీటీ స్కేను బొమ్మలు అందేయో, లేదో కనుక్కుందామని. అందేయిట! చూసిన తర్వాత ఫోను చేస్తానన్నాడు. ఏదో పెద్ద గుర్రానికి పళ్లు తోముతూ ఉండి ఉంటాడు. చూసిన తర్వాత ఫోను చేస్తాడుట. ఉద్ధరించ లేక పోయాడు.

"మహానుభావా! ఇక్కడ మా ప్రాణాలు పోతున్నాయి. కొంచెం త్వరగా తెమల్చవయ్యా"

అని మరో సారి బతిమాలి, చెయ్యగలిగేది మరేమీ లేక కాలు కాలిన పిల్లిలా రెండు నిమిషాలు ఇటూ అటూ తిరిగి, అంబులెన్సు సిబ్బందిని తయారుగా ఉండమని హెచ్చరించి, మళ్లా ఫోను మోగుతుందేమోనని టెలిఫోను పక్కనే కూర్చున్నాను. చెంగమ్మ మగతలోకి వెళ్లి పోతోంది. టెలిఫోను ఎప్పటికీ మోగకపోయేసరికి నేనే ఇక ఉండబట్టలేక మరొక సారి సర్జన్‌కి ఫోను చేసేను.

''క్షమించాలి. మిమ్మల్ని వేధించుకు తినక తప్పడం లేదు. నా పేషెంటు చెయ్యి జారిపోతుందేమోనని అనుమానంగా ఉంది.....''

''పంపండి, చూస్తాం.''

అని ముక్తసరిగా రెండే రెండు మాటలు చెప్పి ఫోను పెట్టేసేడు. ఏం. మరొక మాట మాట్లాడితే అరిగి పోతాడా? ఒళ్లు మండి, టెలిఫోను విసురుగా పెట్టేసి, తర్వాత ''థేంక్స్'' అన్నాను.

నిమిషాల మీద చెంగమ్మని పెద్దాసుపత్రికి బదిలీ చేసేసేము.

వైద్య వృత్తిలో ఉన్న మేము పేషెంట్ల ఎడల అభిమానం, ఆప్యాయత పెంచుకోకూడదు. తామరాకు మీద నీటిబొట్టులా ఉండాలి. నిజమే. కాని మొదట్లో నా వల్ల జరిగిన ఆలస్యానికి ప్రాయశ్చిత్తం ఏదీ? ఆ చెంగ్ చైనా దేశీయురాలు. నేను భారతీయుణ్ణి. ఏదో కాకతాళీయంగా ఈ అమెరికాలో, ఈ ఆసుపత్రిలో కలుసుకోవడం తటస్థించింది. ఆమె ఎలా పోతే నాకెందుకు. మరో కేసు. మరో పేషెంటు అని నేనిలా తర్జన భర్జనలు పడుతూ ఉంటే,

''తుపాకి దెబ్బ! ట్రామా! ట్రామా!''

అని నర్సులు పరుగులు తీస్తూ ఉంటే నా జీవితపు నాటకంలో మరొక అంకం మొదలయింది.

కాని చెంగమ్మ నా మనోఫలకం నుండి చెదరి పోలేదు. వారం గిర్రున తిరిగి పోయింది. మరో కేసు. మరో సందర్భం. అదే నూరో సర్జన్‌తో మాట్లాడ వలసి వచ్చింది. ఉండబట్టలేక అడిగేను.

''వారం రోజుల కిందట పంపిన మిసెస్ చెంగ్ కేసు ఏమయింది?''

అటు నుండి సమాధానం రాలేదు. నా గుండె ఝల్లుమంది.

''అదే, ఆ సెరిబెల్లార్ బ్లీడింగ్‌తో ...''

దుర్వార్త ఎక్కడ వినవలసి వస్తుందో అని మనస్సు పీకుతున్నా, అడగకుండా ఉండలేక పోయాను.

'ఓ! ఆవిడా! నిక్షేపంగా ఉంది. మీరు రోగ నిర్ణయం అంత ఖచ్చితంగా చేసి పంపబట్టే ఆవిడ బతికింది. కొంచెం కాళ్లీడుస్తూ నడుస్తున్నాది. అది కూడ తగ్గి మామూలు మనిషి అవుతుంది.''

''నా నాయనే!!'' అని నాలో నేనే ఆ నూరో సర్జన్‌ని మెచ్చుకుంటున్నానో లేదో,

''డాక్టర్ రావ్! ఎమర్జెన్సీ!!'' అని లౌడ్ స్పీకర్ మీద పిలుపు వచ్చింది.

(టోనీ డేహేర్ రాసిన 'ద టిక్ అఫ్ టైమ్' ఆధారంగా రాసిన కథ)

(తెలుగు జ్యోతి ఫిబ్రవరి 1996 సంచికలో ప్రచురితమైంది.)